సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 5 । డిసెంబర్ । 2024



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికంగా, శారీరకంగా ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. 4లో



వలిసె పూల సోయగం

సాక్షి,పాడేరు: ముంచంగిపుట్టు మండలం దిగువకుమడ ఘాట్‌లో వలిసెపూల తోటలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.



సిరుల తల్లి... ప్రణమిల్లి

విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి సన్నిధిలో తొలి గురువారం పూజలు అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ఎటపాక: సకాలంలో విధులకు హాజరు కాని ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం ఆయన నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉదయం 8.30 గంటలకు వచ్చిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. టెన్త్ వంద రోజుల యాక్షన్‌ప్లాన్ గురించి వివరించారు. పాఠశాల సమస్యలు, నాబార్డ్ నిధులతో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలను హెచ్‌ఎం నుంచి తెలుసుకున్నారు. ప్రార్థన సమయానికి ముగ్గురు టీచర్లు హాజరుకాకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. దీనిపై హెచ్‌ఎం కూడా సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఆ ముగ్గురికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పలు పాఠశాలల సందర్శన

మారేడుమిల్లి: మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు బుధవారం సందర్శించారు. దీనిలో భాగంగా బంద ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ 3,6,9 తరగతుల పరీక్ష విధానాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించారు. పలు సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను తెలుసుకున్నారు.

7న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశాలు

- ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



తల్లిదండ్రులకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయిని

గంగవరం : రంపచోడవరం డివిజన్‌లోని అన్ని పాఠశాల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులను నేరుగా కలిసి ఆహ్వానపత్రాలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వర్షంతో పంటలకు నష్టం



దారపల్లి సమీపంలో పాడైన చోడి పంట

ముంచంగిపుట్టు: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షం వరితోపాటు చిరుధాన్యాల పంటలకు నష్టం కలిగించింది. పొలాల్లోని వరి పనలు తడిచిపోయాయి. వరి, రాగులు, సామలు పంట దిగుబడులు చేతికందే సమయంలో కురిసిన వర్షం వల్ల ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. గింజకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌ఈఏసీ సభ్యుడిగా బాలయ్య



బాలయ్యతో ఏడీఆర్ అప్పలస్వామి, శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి

చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అభ్యుదయ గిరిజన రైతు వండలం బాలయ్యను ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విస్తరణ సలహామండలి సభ్యునిగా నియమించినట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వ్యవసాయ జోన్లనుంచి ఆరుగురు రైతులను సభ్యులుగా వ్యవసాయ వర్సిటీ ఎంపిక చేస్తుందన్నారు. గుంటూరులో వచ్చే ఏడాది జనవరి 8,9 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి 54వ సదస్సుకు సంబంధించి పరిశోధన విస్తరణ సలహామండలి సభ్యులను నియమించినట్టు ఆయన వివరించారు. వీరిలో మన మన్యం జోన్‌నుంచి వండలం బాలయ్యకు అవకాశం కల్పించారన్నారు. ఆయనను ఏడీఆర్, శాస్త్రవేత్తలు అభినందించారు.

వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రులకు వెళ్లిన రోగులు నిరాశకు గురవుతున్నారు. ముఖ్యమైన మందులు అందుబాటులో లేకపోవడంతో ఉన్నవాటితో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. పాడేరులోని ప్రధాన ఆస్పత్రితోపాటు జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ దుస్థితి ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్



పాడేరు జిల్లా ఆస్పత్రిలో మందుల గది వద్ద రోగులు

ఆ మాత్రం లేవా?

ప్రభుత్వాస్పత్రుల్లో ఔషధాల కొరత





సాక్షి,పాడేరు: జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అరకొరగా ఉండటం వల్ల రోగులపై అదనపు భారం పడుతోంది. ముఖ్యమైన ఔషధాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మందులతో వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో యాంటీబయోటిక్స్, జలుబు, దగ్గు నివారణ మందులు గత రెండు నెలల నుంచి నిండుకున్నాయి. వైద్యులు ఓపీ చీటీలపై రాస్తున్న మందులు ఆస్పత్రుల్లో లేకపోవడంతో ఆర్థిక పరిస్థితి బాగున్న వారు ప్రైవేట్ దుకాణాల్లో కొనుక్కొంటున్నారు. లేనివారు వారిచ్చే అరకొర మందులతోనే కాలం గడుపుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో..

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అప్పటిలో అన్నిరకాల మందులు పుష్కలంగా ఉండేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పూర్తిస్థాయిలో మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యమైన అమోక్సిసిలిన్, పొటాషియం క్లావులనేట్ 625/375 యాంటీ బయోటిక్ మాత్రలు సరఫరా లేదు. ఈ రకం ఒక్కో మాత్ర ధర ప్రైవేట్ దుకాణంలో రూ.15 వరకు ఉంది. ఇవి అందుబాటులో లేకపోవడం వల్ల ఈ మాత్రలకు ప్రత్యామ్నాయంగా అమోక్సిసిలిన్ 500 మాత్రలను రోగులకు ఇస్తున్నారు. దీనివల్ల అనారోగ్యం నుంచి కోలుకునేందుకు ఆలస్యమవుతోందని వైద్యసిబ్బంది చెబుతున్నారు. ఇతర అనారోగ్య సమస్యలకు ఉపయోగించే సిట్రిజన్, లివోసిట్రిజన్ మందులు కూడా జిల్లా ఆస్పత్రిలో నిండుకున్నాయి. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరాలతో రోగులు వస్తున్నారు. వీరి వైద్యానికి సంబంధించి యాంటీబయోటిక్స్ అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- బి కాంప్లెక్స్, క్లోర్‌ఫెనిరమైన్, ఇట్రాకోనజోల్, గబాపెంటిన్, సాల్‌బుటమోల్ సిరప్, పెర్మిత్రిన్ అయింట్‌మెంట్ ఔసధాల కొరత కూడా లేకపోలేదు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా లేనందునే ఈ పరిస్థితి అయిన వైద్యులు, సిబ్బంది నుంచి వినవస్తోంది.
- చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అజిత్రోమైసిన్ మాత్రలు, టానిక్‌లు, అమోక్సిసిలిన్ మాత్రలు, అంబ్రోక్సిల్ టానిక్, లాబేటాలాల్ మాత్రల కొరత ఉంది.
- కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐఎండ్ యాంటిబయోటిక్ మాత్రలతో పాటు బీ-12 ఇంజక్షన్లు, చిన్న పిల్లల టానిక్‌లు, ఇతర డ్రాప్స్‌లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- కూనవరం, కోటూరు పీహెచ్‌సీల్లో బి-12, సెఫిక్జిమ్ యాంటీబయోటిక్, పీసీఎం, అమికాసిన్ ఇంజక్షన్లు, లోపెరమైడ్, కెటొకొనెజోల్, బెటా హిస్టిడైన్ మాత్రలు, చిన్నపిల్లలకు సంబంధించిన పీసీఎం.ఎమోక్సిలిన్ సిరప్‌లు అందుబాటులో లేవు.
- ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో డైక్లోపెనిక్, పీసీఎం, అసిలోపెనిక్, ట్రమ్‌డోల్ మందుల కొరత ఉంది.
- ఎల్లవరం పీహెచ్‌సీలో పీసీఎం 650, సైక్లో 75 ఎంజీ మాత్రలతో పాటు ఐరన్ సుక్రోజ్, టాక్సిం, ఎవిల్ ఇంజక్షన్లు నిండుకున్నాయి. డుంబ్రిగుడ పీహెచ్‌సీలో గ్లూకోఫైర్ ఎల్లెట్ తదితర మాత్రల కొరత ఉంది.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	:	1
ఏరియా ఆస్పత్రులు	:	3
కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు	:	5
పీహెచ్‌సీలు	:	64

బయట కొనుక్కోవాల్సి వస్తోంది



పాడేరు జిల్లాలో ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. నెలల శిశువుల్లో జ్వరం, జలుబు, దగ్గుల నివారణ మందులు కూడా అందుబాటులో లేవు. పెద్దలు, చిన్నపిల్లల జలుబు నివారణకు డ్రాప్స్ కూడా లేవని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మందుల కొరత నివారణపై దృష్టి సారించాలి. – పాలికి లక్కు, గిరిజన సంఘం నేత, పాడేరు

కొరత లేకుండా చర్యలు



జిల్లా ఆస్పత్రిలో రోగులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల యాంటీబయోటిక్స్, ఇతర మందులు లేని పక్షంలో ప్రత్యామ్నాయ మందులను రోగులకు పంపిణీ చేస్తున్నాం. అన్ని వ్యాధుల నివారణకు సంబంధించి కొరత ఉన్న మందులను జిల్లా ఆస్పత్రిలో డ్రగ్‌స్టోర్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – డాక్టర్ విశ్వామిత్ర, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పాడేరు

ఎరుపెక్కిన పాడేరు



బహిరంగ సభకు హాజరైన సీపీఎం పార్టీ శ్రేణులు

- అట్టహాసంగా సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు
- భారీగా ర్యాలీ
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన



బహిరంగ సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



పార్టీ శ్రేణుల థింసా నృత్యం

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణం ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. సీపీఎం పార్టీ జిల్లా ప్రథమ మహా సభలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తలార్‌సింగి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు సీపీఎం శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి.

పెంచిన విద్యుత్ చార్జీలపై ప్రజా ఉద్యమం : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాష్ట్రంలో కూటమి సర్కారు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపిందని, ట్రూ అప్ చార్జీలకు ఎలాంటి ప్రాతిపదిక లేదని, ఆ పేరుతో వినియోగదారులను కొల్లగొడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నాడు టీడీపీ స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని చెప్పి నేడు స్మార్ట్ మీటర్లను పెట్టుకోవాలని చెప్పడం అదానీకి దోచిపెట్టడమేనన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వామ పక్ష ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. అధికారంలోకి వస్తే ముందుగా మెగా డీఎస్సీ తీస్తామని ఇచ్చిన హామీ ఆరునెలలైనా అమలుకు నోచలేదని, నోటిఫికేషన్ జారీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అరకు ఎన్నికల సభకు వచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే జీవో నెం.3 పునరుద్ధరిస్తామని, స్పెషల్ డీఎస్సీ తీస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడిస్తారో చెప్పాలని, గత ప్రభుత్వం మాదిరిగా క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. ఏజెన్సీలో ఉన్న అన్ని వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న ప్రేమ అత్యంత వెనుకబడిన అల్లూరి జిల్లా సమగ్రాభివృద్ధిపై ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్ నిబంధనల ప్రకారం పీసా చట్టాన్ని ఉల్లంఘించి గ్రామ సభలు నిర్వహించకుండా ఏజెన్సీ భూములను కార్పొరేట్ శక్తులకు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. ఆదివాసీ గ్రామాల్లో గిరిజనులకు వైద్యం నేటికి అందని ద్రాక్షగానే ఉందన్నారు. పంచాయతీకి ఒక ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి డోలి రహిత ప్రాంతంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ఆదివాసీ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. గత 11 ఏళ్లుగా ఆదివాసీలపై బీజేపీ యుద్ధం చేస్తోందన్నారు. ఆదివాసీల వినాసనం కోసం బీజేపీ పనిచేస్తే సీపీఎం పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసి వచ్చే ప్రతి వారితో తమ పార్టీ ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్పీటీసీ డి. గంగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్, ఉమామహేశ్వరరావు, హైమావతి, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు తిరుమలరావు, సీపీఎం జిల్లా నాయకులు వి.జయ, సుందర్‌రావు, బాల్‌దేవ్, సన్నిబాబు, పాలికి లక్కు, ఎంఎం శ్రీను పాల్గొన్నారు.

వెదురు వస్తువుల తయారీపై ప్రత్యేక శిక్షణ

4లో



కంపించిన భూమి

- విలీన మండలాల్లో రెండు నిమిషాలపాటు ప్రభావం

చింతూరు: మన్యంలోని విలీన మండలాల్లో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఉదయం 7.27 నిమిషాల నుంచి 7.29 నిమిషాల వరకు రెండు సెకన్ల పాటు మూడు సార్లు భూమి కంపించింది. చింతూరు డివిజన్లోని చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఈ ప్రకంపనలు కనిపించాయి. ఈ దృశ్యాలు పలుచోట్ల సీసీ టీవీల్లో రికార్డయ్యాయి. భూకంపం తీవ్రత స్వల్పంగానే ఉండటంతో చింతూరు డివిజన్లలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం ఒక్కసారిగా భూమి కంపించడంతో ఆందోళనకు గురయ్యామని, ఇంట్లోని వస్తువులతోపాటు నీళ్ల కదులుతున్నట్టు అనిపించడంతో భూకంపం వచ్చిందని భావించామని చింతూరుకు చెందిన ఎండీ హసన్ అలీ తెలిపారు. పొరుగునే వున్న తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ఈ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయని, రిక్టర్‌స్కేల్‌పై భూకంపం తీవ్రత 5.3గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ
- పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది



ఎన్నికల సామగ్రి తరలింపును పరిశీలిస్తున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ , ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేఆర్ కల్పశ్రీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నిక సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో మొత్తం 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వై.రామవరం ఎగువ ప్రాంతంలో ఒక పోలింగ్ స్టేషన్, ప్రతీ మండల కేంద్రంలో ఒక్కో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 388 మంది పురుష ఓటర్లు, 249 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 15 మంది పీవోలు, 15 మంది ఏపీవోలు, 45 మంది ఓపీవోలు, 14 మంది మైక్రో పరిశీలకులు, ఏడుగురు సెక్టార్ అధికారులు, ఏడుగురు రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 11 వాహనాలు, ఏడు బస్సులను ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాక్సులను భద్రపరిచి అక్కడి నుంచి కాకినాడ జేఎన్‌టీయూ కళాశాలకు తరలిస్తామన్నారు. చింతూరు డివిజన్‌కు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను చింతూరు పీవో పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తహసీల్దార్ రామకృష్ణ, డీటీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, శివ, సరిత, తేజస్వి, బాషా, త్రిమూర్తులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు సెక్టోరల్ ఆఫీసర్ / ఎంఈఓ-2 సూరయ్య రెడ్డి తెలిపారు.బుధవారం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సామగ్రిని ఆయన పరిశీలించారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

- అప్పు చేసి పప్పు కూడు

విలీనంలో 'భోజన' భారం

- నాలుగు నెలలుగా సరఫరా కాని మిడ్డేమీల్ బియ్యం
- అప్పు తెచ్చి భోజనం పెడుతున్న టీచర్లు, వర్కర్లు
- విలీన మండలాల్లో 64 పాఠశాలల్లో ఇదే దుస్థితి



ముల్లూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కూనవరం : విలీన మండలాల్లోని కూనవరం, వీఆర్ పురం, చింతూరు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఉపాధ్యాయులకు, మిడ్డేమీల్ వర్కర్లకు భారంగా మారింది. నాలుగు నెలల నుంచి బియ్యం సరఫరా నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు, మిడ్డేమీల్ వర్కర్లు బియ్యాన్ని అప్పుగా తెచ్చి పథకాన్ని కొనసాగిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి గిరిజన సహకార సంస్థ, రేషన్ డిపోల ద్వారా బియ్యం, రాగి పిండి, బెల్లం, టెండర్ ద్వారా చిక్కీలు, కోడిగుడ్లు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. భోజనం తయారీకి సంబంధించి కూరగాయలు, ఉప్పు, పప్పు, నూనెను మిడ్డే మీల్ వర్కర్లు సమకూర్చాలి. గత ఆగస్టు నుంచి ఇప్పటివరకు జీసీసీ నుంచి పాఠశాలలకు బియ్యం సరఫరా కావడం లేదు. దీని ప్రభావం కూనవరం మండలంలో 21, వీఆర్‌పురం మండలంలో 23, చింతూరు మండలంలో 20 పాఠశాలలపై చూపింది. ఇప్పటి వరకు ఆయా 64 పాఠశాలలకు 2.14 టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రతి నెలా జీసీసీకి ఇండెంట్ పంపుతున్నా శాంక్షన్ లేదని చెబుతున్నారని పాఠశాలల హెచ్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం పూట పిల్లలను పస్తులు ఉంచడం ఇష్టం లేక కష్టమైనా బియ్యం అప్పుగా తెచ్చి భోజనం అందిస్తున్నామని హెచ్‌ఎంలు, మిడ్డేమీల్ వర్కర్లు తెలిపారు.

బియ్యం అప్పు తెస్తున్నాం



నాలుగు నెలల నుంచి బియ్యం సరఫరా లేదు. దీంతో పిల్లలను ఇబ్బంది పెట్టలేక నెలకు 45 కేజీల చొప్పున ఎండీఎం వర్కర్లు ఇద్దరం కలిసి కొట్టుమీద బియ్యం అప్పు తెచ్చి వండి పెడుతున్నాం. దీనివల్ల సమస్యలు ఎదుర్కొంటున్నాం. – హైదా సత్యవతి, ఎండీఎం వర్కర్, ముల్లూరు ప్రభుత్వ పాఠశాల

శాంక్షన్ లేదంటున్నారు



చౌక దుకాణానికి వెళ్లి అడిగితే వారు శాంక్షన్ రాలేదంటున్నారు. ఇప్పటికి ఒక చోట 4, మరోచోట 2, ఇంకో చోట 4 క్వింటాళ్ల చొప్పున బియ్యం అప్పుగా తెచ్చాం. ఈ విషయం స్కూల్ సందర్శనకు వచ్చిన డీఈవో దృష్టికి తీసుకు వెళ్లాం. – చిచ్చడి అప్పారావు, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, కూనవరం

సమస్య పరిష్కరిస్తాం



మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం రావడం లేదనే విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. పౌరసరఫరాల విభాగం అధికారులతో మాట్లాడి పెండింగ్ రైస్ విడుదల చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. – బ్రహ్మాజీరావు, డీఈవో, పాడేరు

క్లుప్తంగా

గృహాల పనుల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ ఈశ్వర్‌పడాల్

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): మండలంలోని సలుగు పంచాయతీ పెద్దగరు గ్రామంలో పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణ పనులను బుధవారం పాడేరు హౌసింగ్ ఏఈ ఈశ్వర్ పడాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు మీనా తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసుల జారీ సరికాదు

డుంబ్రిగుడ: ఫేషియల్ అటెండెన్స్ వేసేందుకు ఏజెన్సీలో కొన్ని పాఠశాలల్లో సిగ్నల్ పనిచేయని కారణంగా ఉపాధ్యాయులు హాజరుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించకుండా టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిగ్నల్స్ లేని కారణంగా, నెట్ ఫ్రీక్వెన్సీ సరిగా పనిచేయని కారణంగా చాలామంది ఉపాధ్యాయులు ఫేషియల్ అటెండెన్స్ వేసేకోవడానికి ఇబ్బంది పడుతున్నారని ఇది గ్రహించని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన షోకజ్ నోటీసుల వల్ల ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, ఆయా నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శెట్టి అప్పలరాజు, నాయకులు శ్రీను తదితరులున్నారు.

ఉపాధ్యాయ ఓటర్లకు క్యాజువల్ లీవ్

చింతూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉపాధ్యాయ ఓటర్లకు క్యాజువల్ లీవును మంజూరు చేసినట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు

ప్రభుత్వ ప్రోత్సాహకాలు



సిరసపల్లిలో చిరుధాన్యాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కలెక్టర్ దినేష్‌కుమార్

పెదబయలు: రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వ పథకాలు అందించి ప్రోత్సాహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ చెప్పారు. మండలంలోని గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గ్రామస్తులు కలెక్టర్ ఆయనకు గిరిజన సాంప్రదాయంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల సేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గిరిజన ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గిరిజన రైతుల అభివృద్ధికి సహకారం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ దినేస్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రతీ గిరిజన గ్రామంలో ఏర్పాటు చేయాలన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సహకారం అందిస్తాయన్నారు.రైతు ఉత్పత్తిదారులు సంఘాల సహకారంతో రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. జిల్లాలో కొత్తగా మరో 35 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను



రైతులకు కోళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్

ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛంధ సంస్థలతో ఫోరం ఏర్పాటు చేశామని చెప్పారు.ఈ ఫోరంలో 64 స్వచ్ఛంధ సంస్థలు ఉన్నట్టు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు

జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్.నంద్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగు పెరగాలన్నారు. చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాల సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. సుగాగ్ చిరుధాన్యాల చెల్లెళ్ల సంఘం చైర్‌పర్సన్ ఎం.విజయ మాట్లాడుతూ 250 మంది రైతులతో సంఘం ప్రారంభించామని ప్రస్తుతం 1130 మంది సభ్యులున్నట్టు చెప్పారు. ప్రతీ గ్రామంలో జీవ వైవిద్య జాతరలను నిర్వహించి చిరుధాన్యాల సాగుపై చైతన్యవంతం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కెవికే ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేశారు.

కాఫీ తోటలను సందర్శించిన కలెక్టర్

సిరసపల్లి గ్రామ సమీపంలో ఉన్న కాఫీ తోటలను కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. కాఫీ రైతు కుంతూరు బొజ్జన్నతో మాట్లాడి కాఫీ సాగు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా పండిన కాఫీ పండ్లను మాత్రమే సేకరించాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మిరియాల సేకరణకు నిచ్చెనలు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కొర్ర మత్స్యరాజు కుమార్తె భానుప్రియ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతుందని, పింఛన్ మంజూరు బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను విన్నవించారు. దీనిపై ఆయన స్పందించి, పింఛన్ కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్‌కుమార్‌రావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం భాస్కరరావు, కాఫీ బోర్డు అధికారి సుదీప్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో పుష్ప జోసెఫ్, కె.వి.కె.శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఎంపీపీ బొండా వరహాలమ్మ, సర్పంచ్ లోయితాస్, సంస్థ సీఈవో టి.శాంతి, పీఆర్‌వో చైతన్య తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాడేరు : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐటీడీఏ వద్ద చేపడుతున్న రిలే దీక్షలకు సీపీఎం నేతలు, గిరిజన సంఘం నాయకులు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా పాడేరులో చేస్తున్న రిలే దీక్ష శిబిరానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లో సురేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ తదితరులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు తమ సమస్యల కోసం 19 రోజులుగా ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమ్మె కారణంగా విద్యార్థులకు విద్యా బోధన పూర్తిగా కుంటుపడిందన్నారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అర్హులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సీపీఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అంధకారంలో నిర్వాసితుల కాలనీ

- విద్యుత్ సరఫరాను నిలిపివేసిన యంత్రాంగం
- తాగునీటికి ఇబ్బందులు
- కాలనీవాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నిర్వాసిత కాలనీలో విద్యుత్ సరఫరాను తొలగించిన మోటార్ ఇదే

ఎటపాక: మండలంలోని కాపవరంలో నిర్మించిన పోలవరం నిర్వాసితుల కాలనీలో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వీఆర్ పురం మండలం చినమట్టపల్లి పంచాయతీ తుష్టివారిగూడెంకు చెందిన నిర్వాసితులు కాపవరంలో గత రెండేళ్లుగా నివాసం ఉంటున్నారు. నివాస గృహాలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో గత్యంతరం లేక వారు విద్యుత్ పోల్స్‌కు వైర్లు తగిలించి విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది కాలనీకి వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వాటర్ మోటార్ విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బంది తొలగించడంతో తాగునీటి కోసం అల్లాడుతున్నారు. కాలనీలో విషసర్పాలు, ఇతరత్రా విష కీటకాలు సంచరిస్తుంటాయని అంధకారం అలముకుని ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సిబ్బంది బుధవారం మధ్యాహ్నం కాలనీలోని మోటర్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూం ప్రారంభం



తునిలో షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: స్థానిక బాలాజీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూంను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి కొనుగోలు చేశారు. అనంతరం షోరూంలోని ఆభరణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిలకించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొట్టమొదటిగా తునిలో షోరూం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ప్లాట్ ఆరు శాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్ కుమార్‌రాజు, చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆహ్వానపత్రిక



విద్యార్థి రూపొందించిన ఆహ్వాన పత్రిక ఇదే

రాజవొమ్మంగి: మండలంలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో ఈనెల 7న నిర్వహించనున్న పేరెంట్స్–టీచర్స్ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి జి.బాబూరావు వాటర్ కలర్స్‌తో ఆహ్వాన పత్రికలను రూపొందించారు. ఈ కార్డులు ఆకట్టుకున్నాయి.

వీటిని పాఠశాల యాజమాన్యం ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి బాబూరావును హెచ్ఎం రాజా దినకర్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల్లో నిమగ్నమైన విద్యార్థినులు

- జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: యోగాసనాలు ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికంగా, శారీరకంగా ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతాంజలి శ్రీనివాస్ గిరిజన బాలికలకు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులతోపాటు కలెక్టర్ కూడా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగాసనాల ద్వారా అన్ని వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో యోగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లో యోగా శిక్షణ ఉంటుందన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న సెలక్షన్ సెంటర్ కార్పోరల్ సందీప్, సిబ్బంది

జి.మాడుగుల: కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్నిపథ్ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాల గురించి కెరీర్ గైడెన్స్ కార్యక్రమం గురుకులం కళాశాలలో బుధవారం జరిగింది, 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కార్పోరల్ సందీప్ మాట్లాడుతూ అగ్నిపథ్‌లో ఉండే వివిధ రకాలైన ఉద్యోగాలు, అవసరమైన విద్యార్హతలు, నోటిఫికేషన్, దరఖాస్తు చేసే విధానం, అర్హత పరీక్ష గురించి ఆయన వివరించారు. సార్జంట్ ఎస్పీ జాబ్, నోడల్ అధికారి సింహచలం నాయుడు, ప్రిన్సిపాల్ వై.పారయ్య, కళాశాల సిబ్బంది, గురుకులం పాఠశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


అనారోగ్యంతో శిశువు మృతి



మగ శిశువు మృతదేహం

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లుడు సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులకు చెందిన 4 నెలల క్రితం మగ శిశువు జన్మించాడు. శిశువుకు తల్లిపాలు ఇస్తుండగా అకస్మాత్తుగా ఒక్కసారిగా అనారోగ్యానికి గురవడంతో వారు బుధవారం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఇక్కడి వైద్యుల సూచనల మేరకు శిశువుకు మెరుగైన వైద్యం కోసం పాడేరు ఆస్పత్రికి తరలిస్తుండగా శిశువు మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధులువు బోరును విలపించారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన వంతాల జీరో

ముంచంగిపుట్టు: బాబుశాల పంచాయతీ బల్లుగూడ గ్రామానికి చెందిన వంతాల జీరో (33) అనే వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. ఆయన అందించిన వివరాలు.. వంతాల జీరో కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆటోతో ముంచంగిపుట్టు పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సేవలు పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. బుధవారం ఉదయం ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో సీహెచ్‌సీకి వెళ్లి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. జీరోకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహిత మృతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వెదురు వస్తువుల తయారీపై ప్రత్యేక శిక్షణ

చింతూరు: వెదురు వస్తువుల తయారీపై గిరిజనులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) బృందం సభ్యులు తెలిపారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌తో కలసి ఎన్ఐడీ డైరెక్టర్ డాక్టర్ భౌమిక్‌నగార్, ఇంటిగ్రేటెడ్ డిజైన్ హెడ్ రాజీవ్ జస్వాల్, ఔట్‌రీచ్ ప్రోగ్రాం హెడ్ ఆర్నబ్ సేనాపతి బుధవారం కూనవరం మండలం టేకులొద్దితో పాటు చింతూరు సంతలో వెదురు వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వెదురు వస్తువుల తయారీ విధానం గురించి గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వెదురు బొంగులతో తయారయ్యే వివిధ వస్తువుల తయారీ శిక్షణ కేంద్రాన్ని చింతూరు డివిజన్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో అన్ని రకాల యంత్రాలను ఏర్పాటుచేసి గిరిజనులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని బృందం సభ్యులు తెలిపారు.

కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్, సీఐ, ఎస్ఐలు

అరకులోయటౌన్: గంజాయి ఇస్తామని మోసగించిన వారితో పాటు గంజాయి కొనుగోలుకు ప్రయత్నించిన వారిని అరకులోయ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పాడేరు డీఎస్పీ ప్రమోద్ బుధవారం అరకులోయ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి ఇస్తామని చెప్పి మోసగించిన సంఘటనలో నవంబర్ 27న మాడగడ గ్రామానికి చెందిన దినేష్‌కుమార్‌ను ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేశారని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఈ కేసును జిల్లా పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకోని అతి వేగంగా దర్యాప్తు చేసి వారం రోజుల్లోనే ఛేదించి దినేష్ కుమార్‌ను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. గుంటూరు వినుకొండకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ షేక్ యాసీన్ అరకులోయకు వచ్చారు. ఇక్కడ ఉన్న దినేష్‌కుమార్, ప్రకాష్, సుశీల్ కుమార్‌తో పరిచయం పెంచుకున్నాడు. తరుచూ అరకులోయకు వస్తుంటానని తనకూ ఏమైనా అవసరం ఉంటే సహకరించాలని వారిని కోరాడు. ఈ నేపథ్యంలో సంతోష్ అనే వ్యక్తిని షేక్ యాసీన్ అరకులోయ పంపించి గంజాయి కావాలని కొంత నగదు, మరికొంత ఫోన్ పే ద్వారా చెల్లించాడు. దీనిని సుశీల్ కుమార్, ప్రకాష్ అంగీకరించారు. సదరు వ్యక్తి సంతోష్ నుంచి డబ్బులు తీసుకొని వారు సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారన్నారు. ఈ విషయాన్ని షేక్ యాసీన్‌కు ఫోన్ ద్వారా సంతోష్ సమాచారం అందించాడు. నాలుగు రోజుల అనంతరం సంతోష్ మరో వ్యక్తి అరకులోయ వచ్చి నగదు ఇచ్చిన సుశీల్ కుమార్, ప్రకాష్ ఫోన్ చేసినా వారు స్పందించలేదు. వారి కోసం అరకులోయలో గాలించారు. వారి ఆచూకీ దొరక్కపోవడంతో దినేష్‌కుమార్‌ని పట్టుకుంటే తమ డబ్బులు వస్తాయనే ఉద్దేశ్యంతో దినేష్ కుమార్‌ని కిడ్నాప్ చేశారన్నారు. ఒక లక్ష రుపాయలు ఇస్తే మీ అబ్బాయికి విడిచిపెడతామని దినేష్ కుమార్ తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితుల్లో షేక్ యాసీన్, సంతోష్ కుమార్‌లను అరెస్టు చేశామని, మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు చెప్పారు. గంజాయి ఇస్తామని డబ్బులు తీసుకున్న ప్రకాష్, సుశీల్ కుమార్ లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి అతి తక్కువ రోజుల్లో కేసు ఛేదించిన సీఐ హిమగిరి, అరకులోయ, డుంబ్రిగుడ ఎస్ఐలు గోపాలరావు, పాపినాయుడులను డీఎస్పీ ప్రమోద్ అభినందించారు.

100 కేజీల గంజాయి పట్టివేత


అనకాపల్లి : ఊడేరు గ్రామం వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పాడేరు నుంచి అనకాపల్లి వస్తున్న కారులో 100 కేజీల గంజాయితో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తూ పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. ఒకరు తప్పించుకోగా మిగిలిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందన్నారు. కారులో 5 గోనె సంచుల్లో 50 ప్యాకెట్లలో గంజాయి నింపారని, ఒక్కో ప్యాకెట్ సుమారుగా 2 కేజీలు చొప్పున మొత్తం 100 కేజీలు గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. జిల్లాలో వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామానికి చెందిన మహేష్ కుమార్, రాకేష్, అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం వి.కోడపల్లి గ్రామానికి చెందిన ఉల్లి కొండబాబులపై కేసు నమోదు చేయగా, మరో వ్యక్తి పరారైనట్టు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పాత నేరస్తులేనన్నారు. గంజాయిని ఒడిశా నుంచి అల్లూరు జిల్లా జి.మాడుగుల మీదుగా అనకాపల్లి నుంచి విశాఖకు తరలించేందుకు ఉల్లి కొండబాబు పథకం పన్నినట్టు చెప్పారు. కారు డ్రైవర్ తాటికొండ రాకేష్ చోడవరం, అనకాపల్లి మీదుగా, విశాఖ వెళ్లేందుకు చెకింగ్ తక్కువగా ఉంటుందని వాహనాన్ని తీసుకు వస్తున్నట్టు తెలిపారు. పరారైన నిందితుడి కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిందితుల నుంచి కారు, 100 కేజీల గంజాయి, రూ.850 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ బుధవారం తీర్పు చెప్పారు. 2018 మార్చి 20న నర్సీపట్నం ప్రాంతంలోని కృష్ణదేవిపేట దగ్గర కిల్లో జన్, కిల్లో కమల, కిల్లో సీత 50 కిలోల గంజాయి కలిగి ఉండగా.. గొలుగొండ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. సీఐ మధుకుమార్ ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారని అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాద్ రావు తెలిపారు.

కనుల పండువగా శ్రీరామపాదుకా పట్టాభిషేకం

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ జరిగి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన శ్రీరామపాదుకా పట్టాభిషేకం బుధవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి హాజరై భక్తులను అనుగ్రహించారు. వికాస తరంగిణి అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో శారదానది ఒడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా నెహ్రూచౌక్, వేల్పులవీధి జంక్షన్ మీదుగా మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించి చినజీయర్‌స్వామిని తోడ్కొని వచ్చారు. స్వామి అక్కడ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామపాదుకా పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, పట్టాభిషేకం చేపట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, అలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీరామపాదుకలు



ప్రవచిస్తున్న చినజీయర్‌స్వామి